

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - 14వ కథ -

**నేను బాగా రద్దీగా ఉండే ఒక డెలివరీ** యూనిట్ కు హెడ్ గా పనిచేస్తున్న రోజుల్లో.....

వీకెండ్ తర్వాత రోజు, ఏదో తెలియని హడావుడి, తొందరా, నేను గబగబా నడవకపోతే కొంపలు మునుకుపోతాయన్న ఆదుర్దా, ఉంటుంది.

నెమ్మదిగా, చిరునవ్వులు చిందిస్తూ , ఆహ్లాదంగా , పనికి వెళ్ళేవాళ్ళని చూస్తే నాకు అంతులేని అసూయ. నేనెప్పుడూ అలా వెళ్ళలేదు.

ఎప్పటికైనా అలా స్థితప్రజ్ఞత సాధించాలి.

స్థితప్రజ్ఞత, ఆమాట పలకడమూ, పొందడమూ రెండూ కష్టమైనవే!

ఇప్పుడా కష్టమైన స్థితి ఎందుకులే, ఏదో రోజులిలా గడిచిపోతున్నాయిగా అనుకుంటూ అలా ఉరుకులు , పరుగులు పెట్టుకుంటూ వెళ్తూ , డిపార్ట్ మెంట్ చేరే సరికి, బయట ఒక సన్నివేశం కనిపించింది. బయటి వాతావరణాన్ని జాగ్రత్తగా గమనిస్తే , లోపలేం జరుగుతుందో కొంత సమాచారం కూడా తెలుస్తుంది.

రిసెప్షన్ లో ఉన్న సోఫాలో ఓ వయసు మళ్ళినావిడ, ఒక యువకుడు కూర్చుని ఉన్నారు.

ఆవిడ తెలుపు రంగు జరీచీర కట్టుకుంది. ఆవిడ ఎక్కడ కూర్చున్నా, అదెప్పటికీ నలగదు అన్నంత పద్ధతిగా కూర్చుంది. చేతులకు , మెడలోనూ విలువైన వజ్రాల నగలున్నాయి. లేత పసుపు శాలువా కప్పుకుంది. శాలువా మెత్తదనం, దానిమీద ఉన్న సున్నితమైన ఎంబ్రాయిడరీ డిజైన్ చూస్తే అది చాలా ఖరీదైనదిలా ఉంది. ఆవిడ వయసులో ఉన్నపుడు ఎలా ఉండి ఉంటుందో ?

ఆవిడని చూడగానే ఒక మాట స్ఫురించింది.

'రాజమాత '

అతనికి ఓ పాతికేళ్ళుంటాయేమో. చాలా చక్కగా ఉన్నాడు. చాలా అధునాతమైన దుస్తులు వేసుకున్నాడు. ఆడపిల్లలు స్వంతం చేసుకోవాలనిపించే మచ్చలేని అందమైన చర్మం . ఆమె కొడుకులా ఉన్నాడు. ఆ పోలికలు, ఆ రంగు అచ్చం తల్లిపోలిక.

ఎర్ర బడిన కళ్ళు తుడుచుకుంటున్నాడు. ఆమె ఓదారుస్తోంది. కొడుకుని తల్లి ఓదారుస్తోంది అంటే లోపల అతని భార్యకు గానీ, భార్య కడుపులో బిడ్డకు గానే ఏదో ప్రమాదం జరిగి ఉంటుంది .

వాళ్లను పలకరించబోయి ఆగాను. ఏం జరిగిందో తెలుసుకుంటే మంచిదని అనుకుని లోపలికి వెళ్ళాను. నా సెక్రటరీ రోజ్ లీనా , వచ్చింది. నన్ను బద్ధకస్తురాలిని చేసేంత చురుకైన పిల్ల. స్పీడు విపరీతం . తను లేకపోతే కాళ్ళు చేతులూ ఆడవు నాకు. కాకపోతే ఆమె మొహం మీద కనిపించే కలగలపు రంగుల మిశ్రమం నా కళ్ళను శ్రమ పెడుతుంటాయి. ఆ రోజు నేను అటెండ్ అవాల్సిన కార్యక్రమాలు ఏమిటో ఒక అయిదునిముషాల్లో చెప్పేసింది. అవసరమైన పేపర్లు ఫోల్డర్ లో పెట్టి ఇచ్చింది.

అవి తీసుకుని ప్రతి ఉదయం జరిగే డిపార్ట్ మెంట్ మీటింగ్ కు వెళ్ళాను.

ప్రతి ఉదయం, ఒక మీటింగ్ జరుగుతుంది. క్రితం రోజు డ్యూటీ చేసిన డాక్టర్లు , ఆ రోజు డ్యూటీలో దిగబోయే డాక్టర్స్ కు ముందు రోజు జరిగిన కేసుల వివరాలు అందజేస్తారు. ఎవరు ఔట్ పేషంట్ క్లినిక్ లో కూర్చోవాలి, ఆపరేషన్ థియేటర్ కు వెళ్ళాల్సిన కేసులేంటి, వాటికోసం ఎవరు వెళ్ళాలి, డెలివరీ రూం లో ఏమేం చెయ్యాలి, ట్రీట్ మెంట్ కు సంబంధించిన విషయాలు ఇలాంటివన్నీ చర్చకొస్తాయి.

నేను బయట చూసిన సన్నివేశం తాలూకు వివరాలు ఓ పదినిముషాల తర్వాత చెప్పారు. ఒక అమ్మాయికి రెండో సారి కూడా గర్భం పోయింది. లోపలి బిడ్డ అయిదోనెలలోనే చనిపోయింది. ఎన్ని పరీక్షలు చేసినా సరే కారణం దొరకలేదు. వాళ్ళ కుటుంబం చాలా బాధతోనూ , ఆగ్రహంగానూ ఉన్నారట.

మీటింగ్ అయిపోయాక నేను ఆ పేషంట్ ని చూడడానికి వెళ్ళాను. కళ్ళుమూసుకుని పక్కకు తిరిగి పడుకుని ఉంది. ఆమె పక్కన ఎవరూ లేరు. ఫైల్లో ఆమె పేరు చదివి పేరు పెట్టి పిలిచాను. వెంటనే లేచి వెనక్కు జరిగి దిండుకు ఆనుకుని కూర్చుంది. బహుశా ఇరవై ఏళ్ళుంటాయేమో. చామన ఛాయ. తనేదో తప్పు చేసినట్టు, కళ్ళు దించుకుని వుంది . భుజం మీద చెయ్యి వేసి, "బాధపడకు " అన్నాను.

ఆమె 'సరే' అన్నట్టు తలూపింది.

“ఏమన్నా తిన్నావా?”

తిన్నానన్నట్లు తలూపింది కానీ కళ్ళు దించుకునే, పక్కనే ఉన్న దుప్పటిని మెలిపెడుతూ ఉంది. మనకు ఎక్కువగా ఉన్నంత మాత్రాన కనిపించిన ప్రతివారితోనూ పంచుకోలేము. అదీ మనసులో దుఃఖం విషయంలో, మరీ పిసినారితనం చూపిస్తాము. ఆ వాలిన రెప్పలనుండి ముత్యాల్లా రాలిపోతున్నాయి కన్నీళ్ళు. అవి దాచుకోవడానికి ఎంతో అవస్థపడుతోంది. ఆమెకెందుకో నాతోగానీ ఎవరితో గానీ ఏదో చెప్పుకోవాలని ఉన్నట్టనిపించలేదు. కన్నీళ్ళు పంచుకోవడం కన్నా అభిమానం దాచుకోవాలనుకుంటోందని నేనూ ఎక్కువగా మాట్లాడించలేదు.

జూనియర్ డాక్టర్స్ నా చుట్టూ ఉన్నారు.

ఈ పేషంట్ తాలూకు మనుషులెవరూ లేరే అని చిన్నగా వాళ్లనడిగాను.

“మీ ఆఫీసులో వెయిట్ చేస్తున్నారు మేడం” అని చెప్పింది డా. ప్రణవి.

రాత్రి ఆమెతో డ్యూటీ డాక్టర్స్ ఎవరున్నారో కనుక్కుని “ ఆ అమ్మాయిని జాగ్రత్తగా చూసుకోండి. కౌన్సెలింగ్ అయిన తర్వాతే పంపించండి” అని చెప్పి ఒప్పగించాను.

నేను నా రూం కు తిరిగి వచ్చేసరికి తల్లీ కొడుకులు అక్కడే ఉన్నారు. లోపలికి తీసుకెళ్ళి కూర్చోబెట్టి కేసుకు సంబంధించిన వివరాలు చెప్పబోతుంటే,

నేను చెప్పబోతున్న విషయాలు పూర్తిగా వినకుండానే అతను ప్రశ్నలు వేస్తున్నాడు.

“రెగ్యులర్ గా తను చెక్ అప్స్ కు వస్తోంది కదా , ఇది ఎలా జరిగింది.”

“ఎలా జరిగిందో ఇప్పుడే చెప్పలేము. ఎన్నో కారణాలుంటాయి. ఏ కారణం వల్ల ఇలా జరిగిందో తెలుసుకోవడానికి కొన్ని పరీక్షలున్నాయి. ఒక్కో సారి ఎన్ని పరీక్షలు చేసినా కారణం బయటపడకపోవచ్చు.”

బిడ్డ పుట్టిన తర్వాత చేయవలసిన పరీక్షలు వివరించాను.

వాటికి అతనంగీకరించలేదు.

“ఆ పరీక్షలవల్ల ఏదైనా కారణం బయటపడితే , ముందు ముందు జాగ్రత్త పడొచ్చు.”

"ఇప్పటికిది రెండో సారి. నా బిడ్డతో బాటు పెళ్ళైన వారికి పిల్లలు పుట్టి స్కూలుకి కూడా వెళ్తున్నారు. వీడి అదృష్టమే ఇలా అయింది." ఆమె నిష్టూరంగా అంది.

"అలా అనకండి. ఇంకా చిన్న వయసే కదా. తప్పకుండా కలుగుతారు."

"ఒక్క రోజు కూడా ఫ్రెండ్స్ తో కలవలేకపోతున్నాను." అన్నాడు.

"ఎక్కడికి వెళ్ళినా అందరూ పిల్లల్లేరెందుకని అడిగేవాళ్ళే. పెళ్ళిళ్ళకు వెళ్ళడం కూడా మానేశాడు." ఆమె చెప్పింది.

నిజమే! ప్రపంచంలో కొంతం శాతం జనం, వేరే వాళ్ళ వైఫల్యాలను ప్రస్తావించడం లో మిక్కిలి మోజు కనబరుస్తారు. వాళ్ళ ఆసక్తి , జిజ్ఞాసల వల్ల ఎదుటివారి గుండెలు ఎంత గాయమవుతాయో, మరల మరల అడగడం వలన వారి జీవితాలు ఎంత కల్లోలానికి గురవుతాయో తెలియని అజ్ఞానులేం కాదు. ఎదుటి వారు ఎంత బాధపడితే అంత సంతృప్తి!

పెళ్ళై ఆర్నెల్లు కూడా గడవకముందే 'విశేషమా, విశేషమా' అంటూ వెంటబడుతుంటారు. కానీ ఆ ప్రశ్న , ఎదుటి వారి సున్నితమైన వ్యక్తిగత సామర్థ్యాన్ని ప్రశ్నిస్తుందని తెలియక కాదు. అన్నీ తెలిసే! నా వరకు నాకు 'విశేషం' అన్న పదమంటే విశేషమైన అయిష్టత.

పెళ్ళైన వెంటనే గర్భం దాల్చి, పెరిగిన పొట్టతో తిరిగే ఆడవారు, తామేదో కష్టపడి ఆ పట్టా పొందినట్టు, అది సాధించలేని స్త్రీల పట్ల దిక్కుమాలిన దయ ఒలకబోస్తారు.

"గర్భాశయం లో ఏదైనా తేడా ఉందేమో చూశారా?"

" ఆ అమ్మాయి రక్తం మా అబ్బాయి రక్తానికి సూటవలేదేమో?"

అతని తల్లి ప్రశ్నల మీద ప్రశ్నలేస్తోంది. ఆ ప్రశ్నల అస్త్రాలు ఆ భార్యాభర్తల సంబంధాలను దెబ్బతీసేవే . అన్ని ప్రశ్నలకూ చెప్పాల్సిన జవాబులు చెప్పాను.

వెళ్ళబోయే ముందు "మీ బాధ నాకర్థమవుతూనే ఉంది. అది చాలా సహజం కూడా. కానీ, మళ్ళీ ప్రెగ్నన్సీ వస్తుంది. అన్నీ మామూలుగా జరిగి, మీకు సంతానం కలగడం కూడా చాలా సహజంగా జరుగుతుంది. ఇవాళ దెబ్బ తగిలిందని, రేపూ అలా జరగదు కదా." అన్నాను.

నా మాటలు వాళ్ళకేమీ రుచించలేదు. అసంతృప్తి, కోపంతో వాళ్ళ ముఖాలు కఠినంగా ఉన్నాయి.

కాసేపటికి నేను నా ఫైల్స్ తీసుకుని మీటింగ్ కు వెళ్ళబోతుంటే,

ఆమెను వీల్ చెయిర్ లో తీసుకెళ్తున్నారు. ఆమెకు కొద్ది దూరం లో, అతను పాంట్ జేబుల్లో రెండు చేతులూ పెట్టుకుని నడుస్తున్నాడు. కొద్ది దూరంలో అతని తల్లి నడుస్తోంది.

ఒకోసారి పెదవులకన్నా శరీరం లో ఇతరభాగాలే ఎక్కువగా మాట్లాడతాయి. ఆ భాష అర్థం చేసుకోగలిగిన వారికి గుండె బద్దలవడం అనే ప్రక్రియ చాలా తేలిక!

ఆ తర్వాత రెండేళ్ళకు రోజ్లినా సెక్రటరీగా రిజైన్ చేసి వెళ్ళిపోయింది. అప్పటివరకూ నేననభవిస్తున్న సౌకర్యాలేమిటో వెళ్ళిపోయాక నాకు తెలిశాయి. ఆమె లేకపోతే చాలా విషయాలు నాకు గజిబిజిగా అనిపిస్తున్నాయి. 'నాకు సెక్రటరీ కావాలి, తొందరగా ఆ ఏర్పాటు చేయండో' అని అధికారులను మొత్తుకుంటే , జరీనాను పంపారు.

జరీనాను చూడగానే ఎక్కడో చూసినట్లనిపించింది. నాకు వ్యక్తుల ముఖాలు గుర్తుపట్టడం లో విచిత్రమైన రోగం ఉంది.

బంగారపు షాపు ఓనర్ నేనంటే ఎంతో గౌరవం. నేను షాపులో అడుగుపెట్టగానే ఎదురొచ్చి పలకరిస్తాడు. ఆయనతో నేను కూడా బాగానే మాట్లాడతాను. కానీ అదే మనిషి రైల్వే స్టేషన్ లో కనపడితే ఎవరీ మనిషి అని తికమకపడి చచ్చిపోతాను.

మా అన్నయ్య బావమరిది అన్నయ్యతో కనిపిస్తే ఎంతో చక్కగా రిసీవ్ చేసుకునే నేను, ఆయన ఎయిర్ పోర్ట్ లో కనిపించి పలకరిస్తే తడుముకోవాల్సి వచ్చింది.

వాళ్ళకు సంబంధించిన మనుషులతో ఉన్నప్పుడు, వాళ్ళ పరిసరాల్లో వాళ్ళు ఉన్నప్పుడు మాత్రమే గుర్తు పట్టగలగడం ,లేదా తికమకపడిపోవడం అనేది నాకో పెద్ద సమస్య అయేది

జరీనాను ఇంతకు ముందు ఎక్కడ చూశానో గుర్తుకే రావడం లేదు.

వేరే యూనిట్ లో ఉన్న సెక్రటరీని నాకిచ్చారేమో.

అదే అడిగాను.

"ఇదివరకు సెక్రటరీగా ఎక్కడైనా పనిచేశావా?"

"లేదు మేడం నేనీ జాబ్ కు కొత్త. ఉద్యోగం రాగానే మొదటి పోస్టింగ్ మీదగ్గరే." అంది చిరునవ్వుతో.

నవ్వు మొహం. చిన్ని కళ్ళు. గడ్డం మీద చిన్న సొట్ట. అందగత్తె అని చెప్పలేం కానీ, ఎంత బాగుందీ అనుకునేలా తయారయేది. కంటికి శ్రమ కలిగించని రంగుల దుస్తుల్లో వచ్చేది. పరిమితమైన అలంకరణ. వెళ్ళిపోయిన రోజ్ పెదవుల మీద, కళ్ళమీద చూపించిన రంగుల హంగులు అవి నా కళ్ళమీద చేసిన దాడి గుర్తొచ్చింది. జరిగిన గాయాలను మాన్పడానికి వచ్చిన దేవతలా హాయిగా ఉండేది జరీనా.

పని కూడా త్వరగా నేర్చుకుంది. వినయంగా ఉండేది.

ఎప్పుడూ నేను రాబోయే టైముకు ఓ అరగంట ముందే వచ్చేది. చూడాల్సిన పేషంట్స్ అప్పాయింట్ మెంట్స్ , నేను ఇవ్వాల్సిన రిపోర్టులు అన్నీ చాలా బాగా సరిచూసేది. నేను ఏ విషయాల్లో హడావుడి పడతానో తొందరగా గ్రహించేసింది. వాటిని జాగ్రత్తగా ఒక క్రమంలో జరిగేలా చిన్న చిన్న మార్పులు చేసింది. తనకు ఒక పని ఒప్పజెప్తే మనం మర్చిపోవచ్చన్నంత ధీమా వచ్చేసింది.

అంతే కాదు. నేను రాగానే అందమైన పెద్దకప్పులో వేడి, వేడి టీ తీసుకొచ్చేది. మొదట్లో అలాంటి పనులు చేస్తుంటే వద్దని వారించేదాన్ని , మెల్లమెల్లగా దానికి ఎడిక్ట్ ని అయిపోయాను. నేను టీ తాగేంత సేపూ ఎవర్నీ రూం లోకి రానీయకుండా బయటే మేనేజ్ చేస్తుండేది.

అనవసరంగా ఒక్క మాటకూడా ఎక్కువ మాట్లాడదు. మాటల్లో వ్యక్తపరచకపోయినా, నాపట్ల ఎంతో అప్యాయత కనబరచేది.

మనసులో రోజ్ కన్నా జరీనాకు రెండు మార్కులెక్కువే వేశాను.

ఇలాంటి అమ్మాయిని ఎవరు చేసుకుంటారో కానీ బూరెల గంపలోకి సెల్ఫ్ గోల్ చేసుకున్నట్టే.

బయట కాన్ఫరెన్స్ లకు వెళ్ళినపుడు తనకోసం ప్రత్యేకంగా బహుమతులు కొనేదాన్ని. ఇప్పుడు ఏ షాపింగ్ కు వెళ్ళినా , అందమైనది ఏది చూసినా ఇది జరీనాకు బాగుంటుంది అని కొనడం అలవాటైంది.

ఓ రోజు అర్థ రాత్రి ఫోన్ వచ్చింది. హాస్పిటల్ డైరెక్టర్ నుండి ఫోన్ . 'ఊళ్ళో చాలా ముఖ్యమైన వ్యక్తి భార్య డెలివరీ నెప్పులతో హాస్పిటల్ కు వచ్చింది. . మీరెళ్ళి ఆ డెలివరీ చూడాలని' ఆ ఫోన్ సారాంశం. టైం చూశాను. రాత్రి రెండవుతోంది. కింద స్టాఫ్ చాలా పనిమంతులు. నార్మల్ డెలివరీలకు నేను నేను వెళ్ళాల్సిన అవసరమే రానీయరు. అయినా సరే ఆయన చెప్పాడని లేచి తయారయ్యాను.

చీకటి వీధుల్లో సంచారమే లేదు. కార్ పార్క్ నుండి మా యూనిట్ వరకూ నడుస్తుంటే చలి చలిగా ఉంది. లోపలికి వెళ్ళేసరికి డెలివరీ యూనిట్ అంతా హడావుడి గా ఉంది. ఛీఫ్ నర్స్ , మిడ్ వైఫులందరూ అక్కడే ఉన్నారు. బహుశా, పేషంట్ వీ ఐ పి కావడం వల్లనేమో.

వెళ్ళి కేసేమిటో చూశాను. అమ్మాయికి డెలివరీ నెప్పులొస్తున్నాయి. షుమారుగా ఒక గంటలో డెలివరీ అవుతుంది. ఏదైనా ముఖ్యమైన సమాచారం మిస్ అవుతున్నామేమో నని, మళ్ళీ జాగ్రత్తగా చూశాను. అనుమాన పడే విషయాలేమీ కనిపించలేదు. పరిస్థితి అంతా మామూలుగానే ఉంది. పేషంట్ కు ధైర్యం చెప్పి, నర్సులకూ, జూనియర్స్ కూ ఇవ్వాల్సిన సూచనలు ఇచ్చేసి, నా రూం లోపలికి వెళ్ళేసరికి సోఫాలో ఒక ముసలావిడ కూర్చుని ఉంది. ఒకతను షెల్ఫ్ ముందు నిల్చుని ఒక జర్నల్ తీసి తిరగేస్తున్నాడు.

వాళ్ళెవరో కాదు. అదివరకెప్పుడో చూసిన రాజ మాత , ఆమె కొడుకు

జరీనా ఉన్నట్లైతే వాళ్ళని పొరపాటున కూడా లోపలికి పంపించేది కాదు. అలా వాళ్ళిద్దరూ నాకన్నా ముందే నా రూం లో ఉండడం కొంత విచిత్రంగా అనిపించినా , లోపలికి వెళ్ళి చిరునవ్వుతో పలకరించాను.

“ఎలా ఉన్నారు. నేను చెప్పానా, అంతా మామూలుగా జరిగి, త్వరలోనే మీకు సంతానం కలుగుతుందనీ” అన్నాను.

వాళ్ళిద్దరూ వెంటనే ఏం మాట్లాడలేదు..

"మీ భార్యను చూశాను. అంతా బాగానే ఉంది. ఒక గంటలో కాన్పవుతుంది. ఆదుర్దా పడకండి. నా జూనియర్స్ అందరూ అనుభవం గల మంచి డాక్టర్స్. జాగ్రత్తగా చూసుంటున్నారు" అని అతనికి ధైర్యం చెప్పబోయాను.

నామాటలేం పట్టించుకోనట్టు

“మీరు నా వైఫ్ తోనే ఉండండి మేడం . ఈ సారి ఏమాత్రం అజాగ్రత్తగా ఉండొద్దు.”

కోపం తో మొహం లోకి రక్తం జివ్వున చిమ్మినట్లైంది. నేను ఎక్కడ ఉండాలో, ఏ జాగ్రత్త తీసుకోవాలో ఇతనితో చెప్పించుకోవాల్సి వచ్చినందుకు , అతనిపై ఏ రకంగానూ సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నందుకు బాధ పడ్డాను.

అవమానాలకు ఎవరమూ అతీతులు కాదు కదా.

అక్కడ వాళ్ళతో కూర్చోవడం కన్నా , పేషంట్ తో ఉండడం బెటరేమోననిపించింది. డెలివరీ రూం లో కెళ్ళి కేసు పేపర్స్ తిరగేస్తున్నాను.

మొదటి కాన్పు అని రాసి వుంది.

"డా. ప్రవీణా, ఈ అమ్మాయిది మొదటిది కాదు. ఇదివరకు మిస్ కారేజ్ ఉన్నట్లు గుర్తు “ అని చెప్పబోతుంటే

పేషంట్ కనడానికి సిద్ధమైంది.

ఓ అరగంటలో ఆ హడావుడి అంతా అయిపోయింది. తల్లీ , బిడ్డా ఇద్దరూ బాగున్నారు.

బిడ్డ ఏడవడం విన్నారేమో నేను బయటకొచ్చేసరికి పేషంట్ భర్త, అతని తల్లి ఇద్దరూ ఎదురయ్యారు.

అంతా బాగానే ఉందని చెప్పి, నర్సుని పిలిచి బిడ్డను తీసుకురమ్మని వాళ్ళిద్దరికీ చూపించాను.

ఇద్దరూ సంతోషంతో బిడ్డను ముద్దులాడారు.

ఆ తర్వాత , నేను నిద్రకళ్ళతో ఇంటికెళ్ళిపోయాను.

ఉదయం నేను డ్యూటీకి రాగానే మొదట రౌండ్స్ పూర్తి చేశాను .

నేను రాత్రి పేషంట్ ని చూడడానికి ,రూం లో కెళ్ళగానే పెద్దావిడ కోడలిని బుగ్గలు పుణుకుతూ, "మా వంశాన్ని నిలబెట్టావురా బంగారం." అంటూ.ముద్దు చేస్తోంది.

అత్తగారి ప్రేమలో తడిసి ముద్దైపోతోంది ఆ అమ్మాయి. ఆమె పక్కనే కూర్చుని ఉన్నాడు కొత్త హోదాతో కళకళలాడుతున్న ఆమె భర్త.

నేను ఆమెను చెక్ అప్ చేసి ఎప్పుడు డిశ్చార్జ్ చేస్తామో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో, మళ్ళీ ఎప్పుడు హాస్పిటల్ కు రావాలో కొన్ని మాట్లాడి నా రూం కి వచ్చేశాను.

జరీనా టీ తీసుకుని వచ్చింది.

నేను టీ తాగుతూ ఆమెతో ఆ రోజు విషయాలు , ఆడిటింగ్ కు అవసరమైన స్టాటిస్టిక్స్ విషయం లో నాకు కావల్సిన వివరాలు చెప్తుంటే నోట్ చేసుకుంటోంది. ఇంతలో తల్లీ కొడుకులు వచ్చారు. పెద్ద పెద్దవాళ్ళకు అనుమతులు తీసుకోవాల్సిన అవసరం ఉండదు గనక, డైరెక్ట్ గా వచ్చి నా ఎదురుగా కూర్చున్నారు.

వాళ్ళు రాగానే జరీనా వెళ్ళిపోయింది. మామూలుగా అయితే జరీనా ఎంతటి వాళ్ళనైనా సరే, నేను టీ తాగే సమయం లో, లోపలికి రానివ్వదు. ఒకవేళ ఎవరైనా వచ్చినా , చాలా మర్యాదగా ఏదో చెప్పి బయటికి తీసుకెళ్లిపోతుంది . వాళ్ళమీద చిరాకు కన్నా , జరీనా ప్రవర్తన ఆశ్చర్యం కలిగించింది.

చాలా ఖరీదైన స్వీట్స్ ఉన్న పెద్ద పాకెట్ తీసుకొచ్చి , నా టేబిల్ మీదే విప్పారు. పెద్దావిడ ఒక స్వీట్ తీసి తినమంటూ నాకివ్వబోయింది. టీ కప్పు పక్కన పెట్టి అందుకున్నాను.

అభినందనలు తెలియజేశాను.

వాళ్ళిద్దరి ముఖాలూ, అంతకు ముందు చూసినట్టు లేవు . చాలా సంతోషంతో నిండి ఉన్నాయి. ఎవరో పనమ్మాయిని కూడా తోడు తెచ్చినట్టున్నారు. ఆమె లోపలికి వచ్చి వీళ్ళిద్దరినీ ఏదో అడుగుతోంది.

"డాక్టర్లందరికీ ఆ ఎర్ర పాకెట్లివ్వు, బ్లూ కలర్ పాకెట్లు నర్సులకు. " అంటూ ఆమె ఆ పనమ్మాయికి సూచనలిస్తోంది.

బెల్ కొట్టాను. జరీనా వచ్చింది. నా టేబిల్ మీద ఉన్న స్వీట్స్ పాకెట్ చూపించి "ఇవి అందరికీ ఇవ్వు" అన్నాను.

"అయ్యో , ఇది మీకు మాత్రమే. వాళ్లందరికీ వేరే ఇచ్చాములెండి" అంది పెద్దావిడ. ఒక బాక్స్ కూడా తెచ్చి నాకివ్వబోయింది. దాంట్లో బంగారపు గిఫ్ట్ ఉండి ఉన్నట్టనిపించింది. కొన్ని సార్లు బహుమతులందుకోవడం మించిన శిక్ష ఉండదు. !

ఆమె ఇవ్వబోయేది అందుకోకుండా, లేచి నుంచుని "నేను ఓపీకి వెళ్తున్నాను జరీనా, టేక్ కేర్ ఆఫ్ దీజ్" వీళ్ళ సంగతి చూసుకో అన్నట్టు చెప్పాను.

వాళ్ళ మీద నాకు వచ్చిన విసుగు కన్నా, నా ప్రవర్తన మీద వాళ్ళకొచ్చిన విసుగే ఎక్కువ మోతాదులో ఉండడంతో, అవమానానికి గురై వెంటనే లేచి నిల్చున్నారు.

"మీకక్కరలేకపోతే సరే లెండి." అని బయటికి వెళ్ళారు.

జరీనా ఇదివరకిలా ఎవరొచ్చినా చక్కగా హేండిల్ చేసేది. నేను మాట్లాడాల్సిన అవసరమే వచ్చేది కాదు. తను మౌనంగా నుంచోవడంతో వాళ్ళ మీద చిరాకు జరీనా మీద చూపెట్టాను.

"వాళ్లలా గిఫ్టులు అవీ తీసుకొస్తుంటే చూసుకోవేం" అన్నాను.

ఎప్పుడూ పరుషంగా మాట్లాడని నేను అలా మాట్లాడేసరికి జరీనా కళ్లు నిండిపోయాయి. కళ్ళు వాల్చుకుంది. వాలిన రెప్పలనుండి కన్నీళ్ళు రాలాయి.

“అయ్యో ...సారీ జరీనా ”

ఆ వాలిన రెప్పలు, ఆ కన్నీళ్ళు... ఆ అత్తగారు... ఆ అబ్బాయి

జరీనాను ఎక్కడ చూశానో పోల్చుకున్నాను.

అవును ...జరీనా ఎవరో కాదు. ఒకప్పుడు అతని భార్య.

మరి ఈ అమ్మాయి ఎవరూ ?

"జరీనా, నీకతను తెలుసుకదూ, ఐ మీన్ అతను....మరి ఈ పేషంట్ ఎవరు?"

"నాకు డివోర్స్ ఇచ్చేశాడు. అతను మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు మేడం."

"ఓ.. సారీ జరీనా, బాడ్ లక్"

బాడ్ లక్

ఒక్కో సారి అనాలోచితంగా పొరపాటు మాట  అనేస్తాను.

"సారీ జరీనా" అనబోయాను.

"ఎవరిది మేడం బాడ్ లక్?" అంటూ నవ్వింది.

ఎంతైనా, నా తప్పులు సమర్ధవంతంగా మేనేజ్ చెయ్యగలిగే  స్మార్ట్ సెక్రటరీ!

*(వచ్చేనెల మరోకథతో కలుసుకుందాం)*

Post your comments